ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

శనివారం 19 అక్టోబరు 2024



ఉద్యోగులకు ఆర్టీసీ డీఎం అభినందనలు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దసరా సందర్భంగా గోదావరిఖని ఆర్టీసీ డిపో అత్యధిక ఆదాయాన్ని తీసుకురావడం రికార్డు అని, ఉద్యోగులు, అధికారుల సమష్టి కృషితో రూ.5.27కోట్ల ఆదాయం లభించిందని డిపో మేనేజర్ ఎం నాగభూషణం అన్నారు. ప్రయాణీకులకు ఇబ్బంది కలగకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చామన్నారు. దసరా సందర్భంగా 14రోజుల్లో కరీంనగర్ రీజియన్‌లోనే గోదావరిఖని డిపో అత్యధిక కలెక్షన్లు సాధించి రికార్డును సాధించిందని, ఉమ్మడి జిల్లాలో రూ.5.27 కోట్లు ఆదాయం తీసుకువచ్చి 11డిపోల్లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఉద్యోగులు, అధికారుల కృషితో ఆదాయం వచ్చిందని తెలిపారు.



తాళం వేసి ఉన్న ఎకో పార్కు

మంథనిలో ఆహ్లాదం పంచని 'ఎకో పార్కు'

- నిర్వహణ లోపంతో నిరుపయోగం
- తుప్పు పడుతున్న చిన్నారుల క్రీడా సామగ్రి

8



షాపు ఎదుట ఉన్న రేకులను తొలగిస్తున్న సిబ్బంది

గోదావరిఖనిలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

- పలు చోట్ల వ్యాపారులకు ఇబ్బంది
- మెయిన్ చౌరస్తాలో షాపు ధ్వంసం

8

న్యూస్ బాక్స్

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ ఫీజు గడుపు పొడిగింపు

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం చేరేందుకు అడ్మిషన్ ఫీజు గడుపు ఈనెల 30 వరకు పొడిగించడం జరిగిందని ఆధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ సుబ్బారావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్మీడియట్, డిప్లొమాలో ఉత్తీర్ణులైన వారు నేరుగా అడ్మిషన్ పొందవచ్చని పేర్కొన్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థుల ట్యూషన్ ఫీజు ఈనెల 30వరకు చెల్లించాలని, వివరాలకు సెల్ నంబరు 7382929655లో సంప్రదించాలని కోరారు.

పెయింటింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక

ఎలిగేడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎలిగేడుకు చెందిన కోడూరు ఓంప్రకాష్ కూతురు కోడూరి సాహిత్య 2024-25 కళా ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి పెయింటింగ్ పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైందని ఎంఈవో నరేంద్రచారి, కాంప్లెక్స్ హెచ్ఎం గంద్ర దేవేందర్‌రావు తెలిపారు. శుక్రవారం వారు రాష్ట్రస్థాయి పోటీకి ఎంపికైన సాహిత్యను శాలువాతో సత్కరించి అభినందించారు. సాహిత్య ఎలిగేడులో 10వ తరగతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతుందన్నారు. ఆమె జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ చేతుల మీదుగా మెమొంటో అందుకోవడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు.



రుణ మాఫీ కోసం నిరీక్షణ

- 17వేల మంది రుణమాఫీ కాని రైతుల దరఖాస్తు
- రేషన్ కార్డులు లేని కుటుంబ సభ్యుల నిర్ధారణ పూర్తి
- దీపావళి నాటికైనా సొమ్ము జమ చేయాలని రైతుల విజ్ఞప్తి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న రెండు లక్షల రుణ మాఫీ సొమ్ము కోసం జిల్లాలో 17 వేల మంది రైతులు ఎదురుచూస్తున్నారు. అర్హతలు ఉండి కూడా రేషన్ కార్డులు లేక, ఆధార్, బ్యాంకు ఖాతాల నంబర్లు, పేర్లు తప్పుబడి, ఇతరత్రా కారణాల వల్ల రుణ మాఫీ పొందలేకపోయిన వాళ్లు వానాకాలం పంట పెట్టుబడుల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బ్యాంకుల్లో పంట రుణాలు చెల్లిస్తేనే తిరిగి కొత్తగా రుణాలను ఇస్తారు. పంట రుణ మాఫీ అవుతుందని ఆశపడ్డ పలువురు రైతులకు నిరాశే ఎదురయ్యింది. గత ఏడాది నవంబర్ నెలాఖరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రకటించడంతోపాటు తాము అధికారంలోకి వస్తే ఒకే దఫాలో 2 లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని ప్రకటించింది. ఆ మేరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగా, ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. బడ్జెట్ కొరతవల్ల రుణ మాఫీ ఎనిమిది మాసాలు ఆలస్యం అయ్యింది. 2 లక్షల వరకు పంట రుణాలు పొందిన వారందరికీ రుణ మాఫీ అవుతుందని అందరు ఆశపడ్డారు. కానీ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారులు, ఆదాయం పన్ను చెల్లింపుదారులను పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం లబ్ధిదారులతో అనుసంధానం చేసి మినహాయించింది. అలాగే కుటుంబంలో ఒక్కరికే వర్తించే విధంగా రేషన్ కార్డులో ఉన్న వివరాలతో సరిచూసి రుణమాఫీ చేసింది. ఆ లెక్కన జిల్లాలో మూడు విడతల్లో ఆగస్టు 15వ తేదీ నాటికి ఆగస్టు 15వ తేదీ వరకు 2 లక్షల వరకు జిల్లాలో మూడు విడతల్లో కలిపి మొత్తం 51,393 మంది రైతులకు 375 కోట్ల 58 లక్షల 4 వేల 931 రూపాయలు రైతుల ఖాతాల్లో మాఫీ సొమ్మును జమ చేశారు. మొదటి విడతలో లక్ష రూపాయల వరకు 29,724 మంది రైతులకు 149 కోట్ల 42 లక్షల 22 వేల 297 రూపాయలు మాఫీ కాగా, రెండో విడతలో లక్షన్నర వరకు 13,401 మంది రైతులకు 124 కోట్ల 40లక్షల 76 వేల 460 రూపాయలు, మూడో విడతలో రెండు లక్షల వరకు 8,268 మంది రైతులకు 101 కోట్ల 75 లక్షల 6 వేల 174 రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశారు.

● వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు

అన్ని అర్హతలు ఉండి రుణమాఫీ కానీ వారి నుంచి ప్రభుత్వం ఆగస్టు నెలాఖరు వరకు కలెక్టర్ కార్యాలయంలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో మండల వ్యవసాయ శాఖాధికారి కార్యాలయాల్లో, రైతు వేదికల్లో రైతుల నుంచి వ్యవసాయ శాఖాధికారులు, విస్తీర్ణాధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ఈమేరకు 17 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 12,187మంది రైతులు రేషన్ కార్డులు లేని వాళ్లు కావడం గమనార్హం. అలాగే 2,058మంది రైతులకు సంబంధించి బ్యాంకుల్లో ఆధార్ నంబర్లు, పేరు, ఇంటి పేరు, గ్రామం పేరు, స్పెల్లింగ్ మిస్టేక్, తదితర తప్పులు దొర్లిన కారణంగా ఆ రైతుల ఖాతాల్లో రుణమాఫీ సొమ్ము జమ కాలేదు. వీటిని బ్యాంకుల్లో సవరించి తిరిగి ప్రభుత్వానికి పంపించారు. ఇండియన్ బ్యాంకు తప్పిదం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆ బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన వారికి రుణ మాఫీ కాలేదు. అలాంటి వాళ్ల జిల్లాలో 3066 మంది రైతులు ఉన్నారని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి పేర్కొన్నారు. రేషన్ కార్డులు లేని వారి ఇళ్లకు వ్యవసాయ శాఖాధికారులు వెళ్లి నిర్ధారించుకున్న వివరాలను, వారితో దిగిన సెల్ఫీ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. రుణమాఫీ కానీ వాళ్ల వివరాలన్నింటినీ సంబంధిత అధికారులు ప్రభుత్వానికి పంపించినప్పటికీ, ఇప్పటి వరకు రుణ మాఫీ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కాలేదు. ఆ సొమ్ము ఎప్పుడు జమ అవుతుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు. సెప్టెంబర్ అవుతాయనే ప్రకటనలు వెలువడినప్పటికీ డబ్బులు రాలేదు. వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన పంటల సాగు కోసం బయట వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకవచ్చారు. రుణ మాఫీ అయి ఉంటే బ్యాంకులకు వెళ్లి రుణాలు తీసుకునే వాళ్లు. ప్రభుత్వం ఇప్పుడు, అప్పుడు అంటూ వాయిదా వేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దసరా పండుగ వరకైనా రుణ మాఫీ సొమ్ము డబ్బులు ఖాతాల్లో జమ అవుతాయని ఆశ పడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి దీపావళి పండుగ నాటికైనా రుణ మాఫీ సొమ్మును విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎస్సైపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) పొత్కపల్లి ఎస్సైపై మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు నమోదైంది. ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన కోట రాజేందర్‌రెడ్డి ఇంట్లో ఈనెల 9 మధ్యాహ్నం గొడవ జరిగింది. అయితే సమీపాన ఉండే రాపోలు హన్మంతరావు పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని ఈ గొడవలో తననే బూతులు తిడుతున్నారని హన్మంతరావు పొత్కపల్లి పోలీస్‌స్టేషన్లో తప్పుడు ఫిర్యాదు చేసినట్లు రాజేందర్‌రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో 16న ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చి తనను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారని, ఎస్సై అశోక్‌రెడ్డి ఎలాంటి విచారణ చేయకుండా తనను దుర్భాషలాడి తీవ్రంగా గాయపర్చినట్లు పేర్కొన్నాడు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని, దీంతో మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించినట్లు బాధితుడు తెలిపాడు.

ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బొంపల్లిలో ఈజీఎస్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి కూలీల బడ్జెట్ ప్రణాళిక సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్‌ను గ్రామ అధికారులు, మహిళ సంఘాల సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సంపత్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు సన్నద్ధం కావాలి

- తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

పెద్దపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రూప్స్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తూ సన్నద్ధం కావాలని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి, అవసరమైన మౌలిక వసతులు ఉన్నాయో, లేవో పరిశీలించాలని, ఈ ప్రక్రియ రేపటిలోగా పూర్తి చేయాలని కమిషన్ చైర్మన్ కలెక్టర్లను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల ధ్రువీకరణ పూర్తయిన తర్వాత అభ్యర్థుల వివరాలతో కూడిన ఓఎంఆర్ షీట్ల ముద్రణ ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో పరీక్ష ప్రశ్నాపత్రాల, ఇతర ముఖ్యమైన సామగ్రి భద్రపర్చేందుకు స్ట్రాంగ్‌రూమ్‌లను గుర్తించాలన్నారు. పరీక్షలు సజావుగా సాగేందుకు వీలుగా జిల్లాలోని ఒక ప్రాంతంలో ఉన్న పరీక్షా కేంద్రాలకు రీజనల్ కోఆర్డినేటర్లను నియమించామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలను గుర్తించామని, జిల్లా నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ అరుణశ్రీ, పోలీసు నోడల్ అధికారిగా డీసీపీ (అడ్మిన్) రాజు నియమించామని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాశ్, ఏసీపీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గాం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

అంతర్గాం, అక్టోబరు 18: అంతర్గాం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ బీ వెంకటస్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి పకడ్బందీ చర్యలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్

ఎలిగేడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి పగడ్బందీ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ తెలిపారు. శుక్రవారం అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు వివరాలు తెలుసుకున్న ఆయన వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. మీ సేవా కేంద్రాల ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సకాలంలో వాటిని జారీ చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ బషీరొద్దీన్, నాయబ్ తహసీల్దార్ కిరణ్, ఆర్ఐ జయలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఏటీసీ కోర్సులపై విస్తృత ప్రచారం కల్పించాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఐటీఐ కేంద్రాల్లో ఏర్పాటుచేస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో కోర్సుల ప్రవేశాలపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశాలపై కలెక్టర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐటీఐ కళాశాలలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ప్రారంభించిందని, ముఖ్యమంత్రి హైదరాబాదులో ఒకేసారి 65 ఏటిసి కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారని అన్నారు. మొదటి దశలో 25 ఏటీసీ కేంద్రాల్లో ప్రభుత్వం అడ్మిషన్స్ ప్రారంభిస్తుందని, దీనికి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు వచ్చాయన్నారు. జిల్లాలో ఉన్న రామగుండం, పెద్దపల్లిలో ఐటీఐల్లో 2 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు మంజూరయ్యాయన్నారు. ఒక్కోచోట 6 కోర్సులలో 172సీట్లు అడ్మిషన్స్ ప్రారంభించామన్నారు. జిల్లాలోని ఏటీసీల్లో అడ్మిషన్స్ పొందేందుకు ఈనెల 30 చివరి తేదీ అని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ప్రవేశాలకు అర్హులన్నారు. ఒక సంవత్సరం కాలపరిమితిగల మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టీసీ యూజింగ్ అడ్వాన్స్ టూల్ కోర్సులలో 40సీట్లు ఉన్నాయని, రెండు సంవత్సరాల కాల పరిమితిగల బేసిక్ డిజైనర్ అండ్ వర్చుయల్ వెరిఫైర్(మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులలో 24 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఐటీఐ పెద్దపల్లి కేంద్రంలో 172 సీట్లకు 110పైగా భర్తీ జరిగాయని, రామగుండం కేంద్రంలో 35 సీట్లు మాత్రమే నిండాయని, జిల్లాలో ఉన్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అడ్మిషన్ కోసం iti.telangana.gov.in ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్లతో(పదవ తరగతి మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, టిసి, ఆధార్ కార్డు) పెద్దపల్లి ఐటీఐ కేంద్రంలో సంప్రదించాలని కోరారు. సెలవు దినాల్లో కూడా దరఖాస్తు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి తిరుపతి, పెద్దపల్లి, రామగుండం ఐటీఐ ప్రిన్సిపాల్స్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మంథని నియోజకవర్గానికి రూ.25కోట్ల సీఆర్ఆర్ నిధులు మంజూరు

మంథని, అక్టోబరు 18: రాష్ట్ర ప్రభుత్వం మంథని నియోజకవర్గానికి రూ.25కోట్లు సీఆర్ఆర్ నిధులు మంజూరు చేసినట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుక్రవారం తెలిపారు. మంథని మండలంలో ఖానాపూర్ పీడబ్ల్యూ రోడ్ నుంచి ఎల్‌మడుగు వరకు 5 కి.మీ రోడ్డు వెడల్పుల కోసం రూ.7కోట్లు, కమాన్‌పూర్ మండలంలోని కమాన్‌పూర్ నుంచి పెంచికల్‌పేట్ వరకు రోడ్డు వెడల్పు కోసం రూ.4 కోట్లు, రాజాపూర్ నుంచి మంగపేట వరకు రోడ్డుకు రూ.3కోట్లు, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ఓడిపిలవంచ నుంచి గూడూరు వరకు రోడ్డు కోసం రూ.3 కోట్లు, గుండ్రాత్‌పల్లి నుంచి ఊట్లపల్లి పోచమ్మ టెంపుల్ వరకు రోడ్డు కోసం రూ.2కోట్లు, దామెరకుంట పీడబ్ల్యూ రోడ్డు నుంచి మానేరు(ఆరెంద) వరకు రోడ్డు కోసం రూ.2కోట్లు, ధన్వాడ పీడబ్ల్యూ రోడ్డు నుంచి బూడిదపల్లి వరకు రోడ్డు కోసం రూ. 3.95 కోట్లు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.

కాగా, భారీగా రోడ్ల నిర్మాణం కోసం అధిక నిధులు మంజూరు చేయించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఆయా మండలాల, గ్రామాల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు.

● కమాన్‌పూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు అభివృద్ధి పనులకు పంచాయతీ రాజ్‌రూరల్ డెవలప్‌మెంట్ కింద నిధులను మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబుకు పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, నాయ కులు కోలేటి మారుతి, వైనాల రాజు, సయ్యద్ అన్వర్‌లు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి నాణ్యత పరీక్షలు పక్కాగా నిర్వహించాలి



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) ప్రజలకు సరఫరా చేసే తాగునీటి నాణ్యత పరీక్షలు పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం కలెక్టర్ పెద్దపల్లిలోని మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ డివిజన్ కార్యాలయాలను తనిఖీ చేశారు. మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ సబ్ డివిజన్ కార్యాలయాలను సైతం తనిఖీ చేశారు. మిషన్‌భగీరథ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి నాణ్యతను పరీక్షించే జిల్లా లాబొరేటరీ పరిశీలించి నీటి నాణ్యత పరీక్షల రికార్డులను చెక్‌చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం నాణ్యత పరీక్షలు పక్కాగా జరగాలని ఆదేశించారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీటి అంశంలో అలసత్వం వహించకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అధికారులకు తెలిపారు. తనిఖీలో మిషన్ భగీరథ ఈఈ ఇంట్రా గంగాధర శ్రీనివాస్‌పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అన్నయ్యగౌడ్

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



అంతటి అన్నయ్యగౌడ్

సుల్తానాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గ్రంథాయల సంస్థ చైర్మన్‌గా సుల్తానాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంతటి అన్నయ్య గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుల్తానాబాద్ మేజర్ గ్రామపంచాయతీకు అన్నయ్యగౌడ్‌తోపాటు ఆయన సతీమణి కూడా సర్పంచ్‌గా పనిచేశారు. ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షులుగా కూడా పనిచేశారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా విద్యార్థి దశ నుంచే పని చేసిన అన్నయ్యగౌడ్ అంచలంచెలుగా యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలో పలు కీలక పదవుల్లో కొనసాగారు. తన నియామకానికి సహకరించిన మంత్రి శ్రీధర్‌బాబుకు, ఎమ్మెల్యే విజయరమణారావు, డీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ తదితరులకు అన్నయ్యగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ నాయకులు సంబరాలు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అంతటి అన్నయ్యగౌడ్ నియామకంపై పెద్దపల్లి పట్టణంలో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూషణవేన సురేష్ గౌడ్, మస్రత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, బూతగడ్డ సంపత్, బండారి సునీల్ గౌడ్, దొడ్డుపల్లి జగదీష్, నెత్తెట్ల కుమార్, నాంసాని శ్రీనివాస్, తూముల మహేష్, గౌడ సంఘం అధ్యక్షుడు రేగుంట అశోక్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కోల్‌సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్ 6వ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో రూ.5లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను శుక్రవారం కాంగ్రెస్ కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ముస్తాఫా, డివిజన్ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాల్వ శ్రీనివాస్, గట్ల రమేష్, వంగ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై కేసు

- శునకం కళేబరానికి పోస్టుమార్టం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 18: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో తిరుగుతున్న ఒక కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, స్త్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కార్యకర్త తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ కూరగాయల మార్కెట్ ప్రాంతంలో గురువారం ఒక కుక్కను అజీజ్ అనే వ్యక్తి ఇనుపరాడ్‌తో కొట్టి చంపాడు. కుక్క కళేబరాన్ని అక్కడే ఉన్న డస్ట్‌బిన్‌లో పడేశాడు. ఈ ఘటనను స్థానికంగా ఉన్న ఒక జంతు సంరక్షణ కార్యకర్త తన ఫోన్‌లో రికార్డు చేశారు. అనంతరం ఈ విషయాన్ని స్త్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కార్యకర్త ఎదులాపురం గౌతమ్‌కు తెలియజేశారు. వెంటనే ఆ కార్యకర్త సంఘటనాస్థలానికి చేరుకుని కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై కరీంనగర్ ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై జంతు సంక్షేమ ఉద్యమ నాయకురాలు మేనకాగాంధీ పోలీసులకు ఫోన్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కరీంనగర్ వెటర్నరీ హాస్పిటల్‌లో కుక్క కళేబరానికి పోస్టుమార్టం కూడా నిర్వహించారు. ఈ కేసులో నిందితుడికి పోలీసులు నోటీసులు ఇచ్చి పంపించారు. ఆ కుక్క తనను కరవడంతోనే ఆగ్రహంగా అజీజ్ కొట్టిచంపాడని చెబుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



రమ్యకృష్ణ (ఫైల్)

పెగడపల్లి/రామడుగు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన అలువాల రమ్యకృష్ణ (30) చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13న రాత్రి రామడుగు మండలం గోపాల్‌రావుపేట నుంచి పెగడపల్లికి అలువాల విష్ణు, రమ్యకృష్ణలు ఇరువురు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. మ్యాక వెంకయ్యపల్లె గ్రామ శివారులో ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టగా కిందపడి గాయాలపాయ్యారు. రమ్య కృష్ణను చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



లక్ష్మణ్‌గౌడ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన భాగన్నగారి లక్ష్మణ్ గౌడ్ (38) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గంభీరావుపేటకు చెందిన లక్ష్మణ్‌గౌడ్ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ వైన్స్ దుకాణం అనుబంధమైన పర్మిట్ రూంలో కొంత కాలంగా వంట మనిషిగా పని చేస్తుండేవాడు. ఉదయం వచ్చి రాత్రి పూట వెళ్లేవాడు. గురువారం రాత్రి పర్మిట్ రూం మూసిన తర్వాత గంభీరావుపేటకు వెళ్లేందుకు స్థానిక కొత్త బస్టాండుకు చేరుకున్నాడు. ఓ టేలా వెనుక పడిపోయి కనిపించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సుల్తానాబాద్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. కొదురుపాక గ్రామానికి చెందిన దుగ్యాల జితేందర్‌రావు(22) అనే యువకుడు ఇటీవల ఖాళీగా తిరుగుతుండడంతో తల్లి ఏదైనా పని చేసుకోవాలని మందలించింది. దీంతో మనస్థాపం చెందిన యువకుడు ఈనెల 15న ఊరు బయట పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు, బంధువులు అతన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి కొన్నేళ్ల క్రితమే చనిపోగా, తల్లి లక్ష్మికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. పెద్ద కుమారుడు ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లాడు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరుడి రథోత్సవం



లింగన్నపేటలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

గంభీరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి) : గంభీరావుపేట మండ లం లింగన్నపేటలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. స్వామివారి బ్రహోత్సవాల్లో బాగంగా శుక్రవారం రథోత్సవం చేపట్టారు. గ్రామాభివృద్ధి, ఆలయ కమిటీల ఆధ్వ ర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కేదెట్ల..?

- మెట్లదారిలో అడ్డంగా పడిన చెట్టు
- నడిచి వెళ్లే భక్తులకు ఇబ్బందులు



మెట్లదారిలో అడ్డంగా పడిన చెట్టు

మల్యాల, అక్టోబరు 18: కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి కొండపైకి నడిచి వెళ్లే మెట్లమార్గంలో చెట్టు అడ్డంగా పడిపోయింది. దీంతో ఈ మార్గంలో కొండ ఎక్కే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ చెట్టు నెల రోజుల క్రితం పడిపోయినట్లు తెలుస్తుండగా దాన్ని తొలగించడం లేదు. దీనికి తోడు మెట్లమార్గానికి ఇరువైపుల పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి భక్తులు నడవడానికి అవరోధంగా మారింది. అయినా దేవస్థానం అధికారులు పట్టించుకోకపోవడం పట్ల భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు





శిక్షణ పొందుతున్న యువకులతో పీడీ

యువకులకు శిక్షణ ఇస్తున్న గంగసాగర్

నిరుద్యోగ యువతకు అండగా

ఆదర్శం

- ఆర్మీలో చేరాలనుకునే వారికి ఉచిత శిక్షణ
- అభ్యర్థులను తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయుడు
- ఇప్పటి వరకు 45 మందికి ఉద్యోగం

ఆర్మీ ఉద్యోగం సాధించాలనేది ఆయన కల. అందుకు తగ్గట్టుగానే కొన్నేళ్లు కష్టపడ్డాడు. ఎలాగైనా కొలువు సాధించాలని సాధన చేశాడు. కానీ ఆయన కల మాత్రం నెరవేరలేదు. చెవి దగ్గర ఉన్న చిన్న లోపంతో ఆయన ఆర్మీ ఉద్యోగానికి దూరం అయ్యాడు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాడు. ఎంతో ఇష్టమైన ఆర్మీ ఉద్యోగం తనకు దక్కకున్నా ఆసక్తి ఉన్న వారు సాధించేలా సహాయ పడాలనుకున్నాడు. కానిస్టేబుల్, ఆర్మీ ఉద్యోగాలు అంటే ఇష్టమున్న యువతకు ఉచిత శిక్షణ ఇస్తూ వారు ఉద్యోగం సాధించేలా కృషి చేస్తున్నాడు.

మల్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందిన కల్వకోట గంగసాగర్ అనే యువకుడు ఆర్మీ ఉద్యోగం సాధించాలని అనుకున్నాడు. అనుకోని పరిస్థితుల్లో ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాడు. అయితే ఆర్మీ ఉద్యోగం తనకు దక్కకపోయినా ఆ ఉద్యోగంలో యువతను చేర్పించాలనే ఆయన ఆశయంగా పెట్టుకున్నాడు. ఇందులో భాగంగా 2016 నుంచి నిరుద్యోగ యువతకు కానిస్టేబుల్, పారామిలటరీ బలగాలతోపాటు ఇటీవలి అగ్నివీర్‌కు ఉచిత శిక్షణ అందిస్తున్నాడు. ఇప్పటి వరకు ఆయన శిక్షణ అందించిన వారిలో 35మంది కానిస్టేబుల్స్ 10 మంది ఆర్మీలో ఉద్యోగం సాధించారు. 2020లో వచ్చిన కానిస్టేబుల్ నోటిఫికేషన్ సందర్భంగా గంగసాగర్ 85 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చాడు. వారిలో 20 మంది ఉద్యోగం సాధించారు. 2018లో 55మంది శిక్షణ ఇస్తే అందులో 15మంది ఉద్యోగాలు పొందారు.

● ఉద్యోగం.. శిక్షణ

గంగసాగర్ వ్యాయామ ఉపాధ్యాయుడుగా తన సొంతూరులోని జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉద్యోగం చేశాడు. అదే పాఠశాల మైదానంలో యువతకు శిక్షణ ప్రారంభించాడు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శారీరక శిక్షణ ఇస్తూ తరువాత పాఠశాలకు వెళ్లడం ఆయన దినచర్య. ప్రస్తుతం తాటిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నాడు. గంగసాగర్ ఆసక్తి ఉన్న విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేలా నిత్యం శిక్షణ అందిస్తున్నాడు. గంగాసాగర్ వద్ద శిక్షణకు మల్యాల, పెగడపల్లి, గొల్లపల్లి తదితర మండలాల నుంచి యువకులు వస్తుంటారు. ప్రస్తుతం పారామిలటరీ, అగ్నివీర్‌కు 15మంది శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణతో పాటు కెరీర్‌గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నాడు గంగసాగర్.



● మెడికల్ ఫెయిల్‌తో..

గంగసాగర్‌కు చిన్నప్పటి నుంచి ఆర్మీలో ఉద్యోగం సాధించి దేశసేవ సేవ చేయాలని కలలు కనేవాడు. అందులో భాగంగానే శిక్షణ పొందాడు. చెవి సంబంధిత చిన్న పాటి లోపంతో ఆర్మీ ఉద్యోగం సాధించలేక పోయాడు. దీంతో తాను సాధించకున్నా అదే ఉద్యోగం కొంత మంది యువతకైనా దక్కేలా చేయాలని అనుకున్నాడు. వెంటనే ఉచిత శిక్షణ ప్రారంభించాడు.

● ఉచితంగా శిక్షణ ఇస్తా..



ప్రజలకు సేవలందించే పోలీస్, ఆర్మీలో చేరాలనే యువతకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నా. ఆసక్తి ఉన్న యువకులు ఎవరైనా నన్ను సంప్రదించవచ్చు. శారీరక శిక్షణ ఇచ్చి, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తా. నేను ఆర్మీలో చేరాలని అనుకున్న.. సాధ్యం కాలేదు. నాలా ఆసక్తి ఉన్న కొంతమందైనా ఆర్మీలోకి వెళ్లాలనే ఆలోచనతో శిక్షణ ఇవ్వడం ప్రారంభించా.

- కల్వకోట గంగసాగర్

హుజూరాబాద్‌ఏరియా ఆస్పత్రి తనిఖీ

హుజూరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ డాక్టర్ చందు శుక్రవారం తనిఖీ చేశారు. గురువారం రాత్రి ఏరియా ఆస్పత్రిలోని బాత్రూంలో లభించిన నవజాత శిశువు మృతదేహంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో సుధాకర్‌రావు, విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, సెక్యూరిటీ, శానిటైజేషన్ సిబ్బందిని విచారించారు. ఆస్పత్రి సీసీ ఫుటేజీలను పోలీసులకు అందజేశారు. దర్యాప్తు చేసి దోషులను గుర్తించి చర్యలు తీసుకో వాలని ఫిర్యాదు చేశారు. అనంతరం డీసీహెచ్ఎస్ డాక్టర్ చందు మాట్లాడుతూ హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల ఆపరేషన్లు నిర్వహిస్తున్నా మన్నారు. ప్రజలను భయభ్రాంతులను చేయడానికే కొంత మంది ఇలాంటివి చేస్తున్నారని చెప్పారు. ఈ శిశువు మృతదేహం ఆస్పత్రి బయట నుంచి వచ్చిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందిని విచారిస్తున్న డీసీహెచ్ఎస్ చందు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాలతో ఆందోళన

- తన పట్టా భూమిలో నుంచి తోవ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపణ
- తహసీల్దార్ హామీతో ఆందోళన విరమించిన రైతు

గొల్లపల్లి, అక్టోబరు 18: తన పట్టా భూమిలో నుంచి అక్రమంగా తోవ ఏర్పాటు యత్నాలను నిరసిస్తూ జగిత్యాల జిల్లా గొల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ రైతు తన కుటుంబ సభ్యులతో కలిసి పురుగుల మందు డబ్బాలతో శుక్రవారం ఆందోళన చేపట్టాడు. బాధితుడు మండలంలోని బీబీరాజ్ పల్లె గ్రామానికి చెందిన రైతు నరేష్ మాట్లాడుతూ తన పట్టా భూమిలో నుంచి అక్రమంగా తోవ తీయడానికి గ్రామానికి చెందిన కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించాడు. కాలువ పరిసరాల్లో చాలా మంది రైతుల పట్టా భూములు ఉన్నాయని, వారెవ్వరి భూములను సర్వే చేయకుండా తనవే సర్వే చేయడంతో గతంలో పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా మళ్లీ సర్వే చేసేందుకు వచ్చారని పేర్కొన్నాడు.

దీంతో మనస్తాపం చెంది ఆందోళనకు దిగినట్లు బాధిత రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వరందన్ బాధిత రైతు వద్దకు వచ్చి మాట్లాడారు. పట్టా భూమిలో నుంచి ఎలాంటి తోవ ఏర్పాటు చేయడం లేదని, భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొనడంతో బాధితులు ఆందోళనను విరమించారు. ల్యాండ్ అక్విజేషన్‌లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేశామని, అంతే తప్ప పట్టా భూమిలో నుంచి తోవ ఏర్పాటు చేసే అధికారం తనకు లేదని పేర్కొన్నారు. తాను మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టానని, దీని పై పూర్తి స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేర్వేరు చోట్ల చోరీ

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల చోరీలు జరిగాయి. ధర్మారం మండల కేంద్రానికి చెందిన చింతల రాజు అనే వ్యక్తి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు చింతల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి తన కుటుంబ సభ్యులతో కేశపట్నం మండలం రాజాపూర్ గ్రామంలో తన బంధువుల ఇంటిలో నిర్వహించిన శుభాకార్యానికి వెళ్లిన సమయంలో ధర్మారం మండల కేంద్రంలోని తాళం వేసిన తన ఇంటిలో తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఉదయం తన డ్రైవర్ రాజు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయని తెలుపగా కుటుంబ సభ్యులతో సహా ధర్మారం వచ్చి చూసేసరికి తలుపులు పగులగొట్టి, బీరువా తెరిచి ఉందని అందులో 38 గ్రాముల బంగారం, 30 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారం ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లో నారాయణరావు అనే వ్యక్తి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు ఇంటి తాళాలు పగుల గొట్టి తులంన్నర బంగారు చైను. అర తులం చొప్పున ఉన్న రెండు బంగారు ఉంగరాలు, రూ.8 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఇంటి ముందు పెట్టిన కారును తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. వీలుగాక కారును ధ్వంసం చేశారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఇటీవల పలుచోట్ల దొంగతనాలు జరిగాయి. దొంగతనాలకు సంబంధించి పోలీస్‌లు ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వ్యక్తిపై కత్తితో దాడి

కోరుట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన నూనే రవి అనే వ్యక్తిని అదే కాలనీకి చెందిన విబూది కిష్టయ్య కత్తితో దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... నూనే రవి ఇంటి సమీపంలోని కిష్టయ్య వద్ద కొన్ని రోజుల క్రితం మధ్యవర్తిగా ఉండి మరో వ్యక్తికి డబ్బులను ఇప్పించాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తి డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న రవిని డబ్బులు చెల్లించాలని కిష్టయ్య అడిగాడ. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కిష్టయ్య ఇంట్లోకి వెళ్లి కత్తి తెచ్చి రవిపై దాడికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి వారించడంతో కిష్టయ్య అక్కడి నుంచి వెళ్లిపోయాడు. స్థానికులు 100 నంబర్‌కు సమాచారం అందించి రవిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు మద్యం మత్తులో ఘర్షణకు దిగినట్లు స్థానికులు తెలిపారు. రవి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్‌షాప్ వేలంపై కేసు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేటలో బెల్ట్‌షాప్ వేలం వేసిన మాజీ సర్పంచ్ బాలసాని పర్శరాం, బొద్దుల పర్శరాం, గౌర అంజయ్య, సోమ మల్లయ్యపై శుక్రవారం కేసు నమోదు చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖరెడ్డి తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయానికి అమ్మ డానికి పెద్దమనుషులు వేలం నిర్వహించగా జి.శ్రీకాంత్ అనే వ్యక్తిని షాప్ నడిపేందుకు రూ.66,500 డిమాండ్ చేశారని, రూ.33 వేలు తీసుకొని మిగతావి ఇవ్వాలని బెదిరించారని డీఎస్పీ తెలిపారు.




రవీందర్ సాగుచేస్తున్న బంతితోట



పట్టుకుచ్చు తోట

సీజనల్ తోటలు

- పూలు, కూరగాయల సాగుతో లాభాలు
- పండగల సమయంలో పూలకు గిరాకీ



మునగ తోటలో అంతర్ పంటగా బంతి తోట



పూత దశలో ఉన్న బంతి తోట

సైదాపూర్, అక్టోబరు 18: సీజన్‌ను బట్టి పూలు, కూరగాయల తోటల సాగు చేస్తూ కొందరు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రతీసారీ వరి, పత్తి, మొక్క జొన్న పంటలు పండిస్తుండడంతో భూములలో భూసారం తగ్గి పంట దిగుబడి రాకపోవడం, చీడ పీడలు ఆశించడంతో చాలా మంది రైతులు నష్ట పోతున్నారు. దీంతో కొందరు రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారిస్తు న్నారు. సైదాపూర్ మండలం రాంచంద్రా పూర్ గ్రామానికి చెందిన రైతు ఎనుగుల రవీందర్ బంతిపూలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. రవీందర్ తన కున్న నాలుగు ఎకరాల భూమితో పాటు ఇంకో 10 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. సీజన్లను బట్టి కూరగాయలు, పూలతోటల పెంపకానికి మొగ్గు చూపాడు. ఎనిమిది ఎక రాల్లో పూలు, కూరగాయలు సాగు చేస్తు న్నాడు. ఎకరానికి రెండు లక్షల వరకు ఆదా యం వస్తుందని రవీందర్ అంటున్నాడు. వ్యవసాయంతోపాటు రవీందర్ పాడి ఆవులు పోషిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నాడు.

● మునగ తోటలో అంతర పంటలుగా..

ఎనిమిది ఎకరాల్లో మునగ తోట సాగు చేస్తున్నాడు. చెట్ల మధ్యలో ఖాళీగా ఉన్న భూమిలో అంతర పంటగా బంతి, పట్టు కుచ్చు పూల తోటలు సాగు చేశాడు. బతుకమ్మ పండగ మొదలు కొని ఉగాది వరకు పూలకు మంచి గిరాకీ ఉంటుంది. దసరా నుంచి ఉగాది వరకు మంచి రోజులు ఉండడంతో శుభకార్యాలు జరుగుతుంటాయి. ఈ సమయంలో పూలకు మంచి గిరాకీ ఉంటుంది.

● గిరాకీకి అనుగుణంగా కూరగాయల సాగు

ఏ కూరగాయలకు ఏ సీజన్‌లో గిరాకి ఉంటుందోనని గుర్తించి, ఆ సీజన్‌లో ఆ కూరగాయలు సాగు చేస్తుంటాడు. పండిన కూరగాయలు, పూలను హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, కరీంనగర్, సిద్దిపేట మార్కెట్లకు తీసుకెళ్లి అమ్ముతుంటారు. తోట వద్దకు వచ్చిన వారికి తాజా పూలు, కురగాయలు కోసి అమ్ముతారు..

● మంచి లాభాలు వస్తున్నాయి

నేను ఎనిమిది సంవత్సరాలుగా కాలానికనుగుణంగా సీజన్ బట్టి పూలు, కూరగాయల తోటలు సాగు చేస్తున్నాను.ఎకరాకు పెట్టుబడి పోను 1.5 లక్షల రూపాయల వరకు ఆదా యం వస్తుంది. కష్టపడి పని చేస్తే వాణిజ్య పంటలతో లాభాలు పొందవచ్చు.

- ఎనుగుల రవీందర్, రైతు, రాంచంద్రాపూర్



బంతి తోటలో ఎనుగుల రవీందర్

న్యూస్ బాక్స్

అవిష్కరణలపై ఎస్సారార్‌లో వర్క్‌షాప్

గణేశ్‌నగర్,అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో శుక్రవారం సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీం, పాలసీస్, ఐక్యుఏసీ సంయుక్త నిర్వహణలో కళాశాల అధ్యాపకులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ మాట్లాడుతూ మారుతున్న పోటీ ప్రపంచంలో ఇనిస్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ నిరంతరం మదింపు చేసుకుంటూ ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వర్క్‌షాప్ కొరకు ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలను ఎంచుకున్నందుకు కళాశాల విద్యా కమిషనర్ శ్రీ దేవసేనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని క్రిస్ప్ కోఆర్డినేటర్ సురభి కాక్ నిర్వహించారు. ఇనిస్టూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ సస్టెనబుల్ గోల్స్ విశ్లేషణ, విజన్ మిషన్, లక్ష్యాలపై ఉదాహరణలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముందుగా ఫ్లగ్ పోస్ట్ టెరిటరీ అనే కార్యాచరణను ఆమె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ హరజీత్ కౌర్ మాట్లాడుతూ ఐక్యుఏసి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగడం చాలా సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ పి నితిన్, టి రాజయ్య, సీఓఈ డాక్టర్ శ్రీనివాస్, ఐక్యుఏసి సభ్యులు డాక్టర్ టి కరుణాకర్, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సోమనరసయ్య, డాక్టర్ రాజశ్రీ, ప్రేమ్చందర్, అన్ని విభాగాల హెచ్ఓడిలు, ఇతర అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

కాటన్ వస్త్ర పరిశ్రమకు చేయూతనివ్వాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల కాటన్ వస్త్ర పరిశ్రమతోపాటు వాటిపై ఆధారపడిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని జిల్లా సైజింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వొల్లాల కిషోర్, ఎలిగేటి రాము డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత జౌళి శాఖ కార్యాలయానికి కరీంనగర్ జిల్లా సైజింగ్ వర్కర్స్ యూనియన్ సిరిసిల్ల శాఖ ఆధ్వర్యంలో కాటన్ కార్మికులు తరలివచ్చి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమ రెండో భీవండిగా పేరుగాంచిందన్నారు. గతంలో సిరిసిల్లలో వేలాది మర మగ్గాలు ఉండేవని, వాటికి అనుబంధంగా 30 సైజింగ్ పరిశ్రమల తోపాటు క్లాత్ డైయింగ్, పెట్టి కోట్స్, హమాలీ, ట్రాన్స్ పోర్ట్‌ల ద్వారా వేలాది మంది జీవనోపాధి పొం దారని అన్నారు. గత ప్రభుత్వం కాటన్ వస్త్ర పరిశ్రమలకు మొండి చేయి చూపిందని, పాలి స్టర్ బతుకమ్మ చీరల ను తయారు చేయిం చడంతో కాటన్ వస్త్ర పరిశ్రమ కుంటు పడిపోయిందని అన్నారు. కార్మికులకు జీవనోపాధి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ప్రకటిం చిన చీరలను కాటన్‌తో తయారు చేయించాలని కోరారు.



కరీంనగర్ జిల్లా జైలు

బతుకుపై భరోసానిస్తూ..

ఒకప్పుడు జైళ్లు అంటే కఠిన శిక్షలకు మారు పేరు..

ప్రస్తుతం పరిస్థితులు మారాయి. ప్రభుత్వాలు పలు సంస్కరణలను అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా శిక్షను అనుభవిస్తున్న ఖైదీలకు వివిధ పనుల్లో శిక్షణను అందిస్తున్నారు. కరీంనగర్ జిల్లా జైలు ఆవరణలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తున్నారు. ఇందులో శిక్షను అనుభవిస్తున్న వారితోపాటు విడుదలైన వారూ పని చేస్తున్నారు. జైలులో పలువురు ఫర్నీచర్, ఇతర వస్తువులు తయారు చేస్తున్నారు. దీని ద్వారా ఖైదీలు ఉపాధి పొంది కొంత మొత్తాన్ని ఇంటికి పంపించుకుంటున్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత తాము నేర్చుకున్న పనులు చేసుకుంటూ సమాజంలో గౌరవంగా బతుకుతున్నారు.

- సంస్కరణలకు కేంద్రంగా కరీంనగర్ జిల్లా జైలు
- ఖైదీలకు వివిధ అంశాల్లో శిక్షణ
- పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుతో ఉపాధి
- జైలు నుంచి విడుదలైన తర్వాత గౌరవంగా బతికేలా చర్యలు



బంకులో పని చేస్తున్న ఖైదీలు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నేర సంఘటనల్లో జైలుకు వెళ్లిన ఖైదీలపై సమాజంలో కొంత చెడు అభిప్రాయం ఉండడం సహజం. శిక్షణ అనుభవించి బయటకు వచ్చిన తర్వాత తమ పద్ధతి, వ్యవహారశైలిని మార్చుకుని మంచి వ్యక్తులుగా జీవించాలని భావించినా సమాజంలో వారిని నేరస్థులుగానే పరిగణిస్తున్నారు. దీంతో వారికి ఎక్కడా సరైన ఉపాధి లభించడం లేదు. ఇటువంటి పరివర్తన చెందిన ఖైదీల కోసం జైళ్లశాఖ ఉపాధి కల్పనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ఖైదీలకు వివిధ వృత్తుల్లో శిక్షణనిస్తోంది. శిక్ష కాలంలో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు ఉపాధి కల్పిస్తూ జైలు నుంచి విడుదల అయిన తరువాత వారు మళ్లీ నేరాలకు పాల్పడకుండా జీవనోపాధి మార్గాలను చూపుతున్నది. ఖైదీల నడవడికలో మార్పును తీసుకువచ్చి సమాజంలో పౌరులుగా గౌరవంగా బతికేలా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జైళ్ల శాఖ ముందుకు సాగుతున్నది.

● వివిధ పనుల్లో శిక్షణ

కరీంనగర్ జిల్లా జైలులో పలు సంస్కరణలు తీసుకు వచ్చారు. మొదట ఖైదీలకు వరంగల్ సెంట్రల్ జైలు, కరీంనగర్ జైలులో వివిధ పనుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆ తరువాత శిక్షణ పొందిన ఖైదీలతో ఫర్నిచర్, ఫినాయిల్ తయారీని చేపట్టారు. జైలు ఆవరణలో ఐఓసీఎల్ సంస్థ సహకారంతో మై నేషన్ పేరుతో పెట్రోల్‌బంక్‌ను నెలకొల్పారు. ఈ పెట్రోల్‌బంక్‌లో ప్రస్తుతం ఐదుగురు రిమాండ్ ఖైదీలతోపాటు జైలు నుంచి విడుదలైన మరో 20 మందికి ఉపాధిని కల్పిస్తున్నారు. వీరిలో రిమాండ్ ఖైదీలకు రోజుకు 225, శిక్ష అనుభవించి విడుదలైన వారికి రోజుకు 550 రూపాయల చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు.

● పెట్రోల్ బంక్ విస్తరణ

కరీంనగర్ జిల్లా జైలు ఆవరణలో 2017 జూన్ 17న ఐఓసిఎల్ పెట్రోల్‌బంక్‌ను ప్రారంభించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) సంస్థ మొదట మూడు యంత్రాలతో 12 నాజిల్స్ ఏర్పాటు చేసింది. గిరాకీ పెరగడంతో ఆరు యంత్రాలు, 24 నాజిల్స్‌కు విస్తరించింది. జైలుకు చెందిన 1,200 చదరపు గజాల విస్తీర్ణంలో బంక్ నిర్మాణానికి ఒప్పందం చేసుకుని ఈ స్థలాన్ని 20 ఏళ్లపాటు ఐఓసీఎల్ సంస్థ లీజుకు తీసుకున్నది. ఈ పెట్రోల్‌బంక్‌లో రోజుకు 18 లక్షల నుంచి 20 లక్షల వ్యాపారం జరుగుతున్నది. రోజుకు ఎనిమిది వేల నుంచి 10 వేల లీటర్ల పెట్రోల్, ఆరు వేల నుంచి 8 వేల లీటర్ల డీజిల్ అమ్మకాలు జరుగుతున్నాయి. పెట్రోల్ అమ్మకాలపై లీటరుకు రెండు రూపాయలు కమిషన్‌గా ఆదాయం సమకూరుతున్నది. జిల్లా జైలు రెండున్నర ఎకరాల స్థలంలో ఉంది. ఇందులో జైలు బ్యారక్, ఇతర కార్యాలయాలు, జైలు అధికారులు, సిబ్బంది క్వార్టర్స్ ఉన్నాయి. జైలు ఆవరణలోని పెట్రోల్‌బంక్ లాభసాటిగా నడుస్తుండడంతో కరీంనగర్ శివారులో మరో పెట్రోల్ బంక్‌ను జైళ్లశాఖ లీజ్‌కు తీసుకుని నడిపిస్తున్నది. ఈ పెట్రోల్‌బంక్‌లో రోజుకు నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వ్యాపారం సాగుతున్నది. ఇక్కడ ఎనిమిది మంది ఖైదీలు పనిచేస్తున్నారు. జైలు లోపల ఏర్పాటు చేసిన ఫర్నిచర్ తయారీ కేంద్రంలో మరో 30 మంది వరకు ఉపాధిని కల్పిస్తున్నారు.

● జైళ్ల శాఖ అవుట్‌లెట్...

కరీంనగర్ జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఆనుకుని ఒక అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసి ఇందులో కరీంనగర్, వరంగల్ సెంట్రల్ జైలు ఖైదీలు తయారు చేసిన వస్తువులను విక్రయిస్తున్నారు. వీటికి మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ స్టాల్‌లో కూడా ఖైదీ ఉపాధి పొందుతున్నాడు. జైలు ఆవరణలో నర్సరీలో పెంచిన మొక్కలను, ఫినాయిల్‌ను కూడా ప్రత్యేకస్టాల్ ఏర్పాటుచేసి విక్రయిస్తున్నారు. జైల్ ఇండస్ట్రీలో తయారైన కుర్చీలు, టేబుళ్లు ఇతర ఫర్నిచర్‌ను పాఠశాలలకు విక్రయిస్తున్నారు.

ఆరేళ్లుగా పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాను : ఇర్ఫాన్, ఓపెన్‌జైలు ఖైదీ

నేను జైలులోనే ఉంటూ ఇక్కడి పెట్రోల్‌బంక్‌లో ఆరేళ్లుగా పని చేస్తున్నాను. సంపాదించిన డబ్బుల్లో కొంత ఇంటికి పంపిస్తున్నాను. ఓపెన్ జైలులో భాగంగా పెట్రోల్‌బంక్‌లో పనిచేయడం వల్ల నిత్యం ప్రజల్లో ఉండడంతో ప్రశాంతంగా ఉంది. సత్ప్రవర్తనతో ఉండడంతో ఆరు నెలలకు ఒకసారి నెల రోజులు పెరోల్‌పై ఇంటికి వెళి కుటుంబసభ్యులతో గడుపుతున్నాను.

ఉపాధి చూపించారు.. : రాజు

2015 నుంచి జైలు పెట్రోల్‌బంక్‌లో పని చేస్తున్నాను. ఏడు సంవత్సరాల క్రితం జైలు నుంచి విడుదల అయినప్పటి నుంచి పెట్రోల్‌బంక్‌లో పార్ట్ టైంగా పనిచేస్తూ మిగతా సమయంలో ఇంటి వద్ద వ్యవసాయం, ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. నెలకు 16 వేల రూపాయలు సంపాదిస్తున్నాను. నాకు ఉపాధిని కల్పించిన జైలు అధికారులకు కృతజ్ఞతలు.

● ఖైదీల్లో పరివర్తనపై దృష్టి సారించాం..



క్షణికావేశంలో చేసిన తప్పుకు జైలుకు వచ్చిన ఖైదీల్లో పరివర్తతీసుకువచ్చి, సత్ప్రవర్తన కలిగిన వ్యక్తిగా జైలు నుంచి బయటకు వెళ్ళి సామాన్యజీవిత గడిపేలా చేయడమే ధ్యేయంగా జైలు అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నాం. నేరస్థుడిలో మార్పు తీసుకువచ్చి సమాజంలో గౌరవంగా బతికేలా అతనికి ఉపాధి కల్పించటానికి ప్రయత్నిస్తున్నాం. ఖైదీలకు వివిధ వృత్తుల్లో శిక్షణను అందిస్తూ సొంతకాళ్లపై నిలబడేలా చర్యలు తీసుకుంటున్నాం. స్వచ్ఛతకు మారుపేరుగా మైనేషన్ బ్రాండ్‌తో పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తున్నాం. 24 గంటలపాటు సీసీ కెమరాల నిఘాలో ఈ పెట్రోల్ బంక్ నడుస్తుంది.

- కె శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్

పత్తి నాణ్యత బేష్

● సీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్‌డావే



జిన్నింగ్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న అర్జున్‌డావే

జమ్మికుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో పత్తి నాణ్యత బాగుందని కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్‌డా వే అన్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలో నోటిఫై చేసిన ఏడు జిన్నింగ్ మిల్లులను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. మిల్లుల్లోని యంత్రాలు, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిన్నింగ్ చేసేందుకు యంత్రాలు సిద్ధంగా ఉన్నాయో, లేదో పరిశీలించారు. పత్తి మార్కెట్ యార్డును సందర్శించారు. బహిరంగ వేలం పాట ద్వారా ట్రేడర్స్ ఏ విధంగా కొనుగోలు చేస్తున్నారో పర్యవేక్షించారు. రైతులు తీసుకు వచ్చిన పత్తి నాణ్యతను పరిశీలించారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆర్ మల్లేశం, ఇతర అధికారులు, జిన్నింగ్ మిల్లర్లతో కలిసి సమావేశం అయ్యారు. జిన్నింగ్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీసీఐ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ జమ్మికుంటలో పత్తి నాణ్యత చాల బాగుందన్నారు. కాని తేమశాతం 30పైకి పైగా వస్తుందన్నారు. రైతులు ఇంటి వద్దనే పత్తి ఆరబెట్టి తీసుకు వస్తే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందన్నారు. నోటిఫై చేసిన మిల్లులన్ని తనిఖీలు చేశామని, జిన్నింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. తేమశాతం 12లోపు వస్తే కొనుగోళ్లు చేపట్టేందుకు ఇప్పుడు కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ మద్దతు ధర 7,521 రూపాయలు దాటి ప్రైవేట్ ట్రేడర్స్ కొనుగోళ్లు చేపడితే కమర్షియల్ పర్చస్ సైతం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వరంగల్ సీసీఐ పరిధిలోని కరీంనగర్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు ధ్రువీకరణ పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. కాగా పట్టణంలోని సరిత కాటన్ జిన్నింగ్ మిల్లుకు ఓ రైతు తమ పత్తిని విక్రయానికి తెచ్చాడు. పత్తిని పరిశీలించే ముందు సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్‌డావే తమ కాళ్లకు ఉన్న షూస్‌ను తొలగించి పత్తిని ముట్టుకు న్నారు. రైతు పండించిన పత్తిని సీసీఐ అధికారి అంత పవిత్రంగా బావించడంపై అక్కడున్న వారు అభినందిస్తూ చర్చించుకున్నారు.

'శాతవాహన' వీసీగా ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్



ఉమేశ్‌కుమార్

కరీంనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాతవాహన యూనివ ర్శిటీ ఉపకులపతి (వీసీ)గా ప్రొ ఫెసర్ డాక్టర్ యు. ఉమేశ్‌కుమార్ నియ మితులయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణ పేటకు చెందిన ఉమేశ్‌కుమార్ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా, రిజిస్ట్రార్‌గా, శాతవాహన యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. యుఎస్ఏలోని యూనివర్శిటీ ఆఫ్ వెర్మోంట్‌లో బయోకెమిస్ట్రీ విభాగంలో పోస్ట్ డాక్టోరల్ అసోసియేట్‌గా సేవలందించారు. 28 సంవత్సరాల బోధన, 20 సంవత్సరాల పరిశోధన అనుభవాన్ని కలిగిన ఉమేశ్ కుమార్ వివిధ జాతీయ, అంతర్జాతీ య పత్రికల్లో 36 కథనాలను ప్రచు రించారు. అతడు యూజీసీలో సైతం రెండు చిన్న పరిశోధన ప్రాజెక్టులను చేపట్టారు. ఆయన మార్గదర్శకత్వంలో తొమ్మిది మంది పరిశోధకులకు పీహెచ్‌డీ పొందగా, ఒకరు పీహెచ్‌డీ కోసం పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని సెంట్రల్ యూనివర్శిటీ ఈసీగా, హర్యానాలోని బివానీ చౌదరి బన్సీలాల్ విశ్వవిద్యాలయానికి గవర్నర్ నామినీగా నియమితు లయ్యారు. పాలమూరు యూనివర్శిటీలో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌గా ఉమేశ్‌కుమార్ పనిచేశారు. అత్యుత్తమ విద్యా సహకారాలకు వివిధ విద్యావేత్తల నుంచి అవార్డులను అందుకున్నారు. అతను ఎంచుకున్న రంగంలో అకడమిక్ ఎక్సలెన్స్‌గా గుర్తింపుతో అవార్డులను స్వీకరించారు. సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, ఐఎస్ఐఆర్ అందుకున్నారు. ఉస్మానియా యూనివర్శిటీలో వివిధ అడ్మినిస్ట్రేటివ్, అకడమిక్ పదవులను నిర్వహించారు. నవంబర్ 19, 2015న భారత రాష్ట్రపతి నుంచి ప్రతిష్టాత్మక ఇందిరాగాంధీ జాతీయ స్థాయి ఎన్ఎస్ఎస్ ట్రోఫీని కూడా అందుకున్నారు. వివిధ రంగాల్లో విశిష్ట అనుభవం కలిగిన ప్రొఫెసర్ యు.ఉమేశ్‌కుమార్‌ను శాతవాహన వీసీగా నియమించడం పట్ల పలువురు విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆయన శనివారం వీసీగా బాధ్య తలు స్వీకరిస్తారని తెలిసింది.

గ్రానైట్ లారీని ఢీకొన్న మినీ వ్యాన్

● ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన మినీ వ్యాన్

తిమ్మాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగివున్న గ్రానైట్ లారీని మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గ్రానైట్ లారీ మండలంలోని ఎల్ఎండీ కాలనీ మహిళా శిశు కేంద్రం సమీపంలో రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి నిలిచిపోయింది. వరంగల్ వైపు నుంచి సిద్దిపేట వైపు వెళుతున్న మినీ వ్యాన్ ఆగివున్న గ్రానైట్ లారీను అతి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్‌లో ఉన్న సిద్దిపేట జిల్లా గౌరెల్లి మండల్ కొండాపూర్ గ్రామానికి చెందిన భూక్యరాజు, సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం కొతిగల్ గ్రామానికి చెందిన ఎల్ వాగ్య వాహనంలోనే ఇరుక్కుపోయారు. అటుగా వెళుతున్న వాహనదారులు ఆగి వాహనం లో ఇరుక్కుపోయిన ఇద్దరినీ బయటకు తీసి అంబులెన్స్‌లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సంఘటన స్థలానికి ఎల్ఎండీ బ్లూ కోల్ట్స్ పోలీసులు సురేష్, మల్లికార్జున్ చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి సీఎం గ్రీన్ సిగ్నల్

కోల్‌సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు ప్రభుత్వం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు సంబంధించి లాంఛన ప్రక్రియను పూర్తి చేసింది. ఇప్పటికే కలెక్టర్ నుంచి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల పరిధిలోని పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీలు, రామగిరి, కమాన్‌పూర్, పెద్దపల్లి, అంతర్గాం, పాలకుర్తి మండలాలు అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలోకి వస్తున్నాయి. ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ధర్మారాన్ని కూడా దీని పరిధిలోకి చేర్చారు. వెల్గటూరు మండల పరిధిలోని కొన్ని గ్రామాలు విలీనం కానున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. రామగుండంతో పాటు మరో రెండు మూడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సైతం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. రామగుండం శాసన సభ్యుడు రాజ్‌ఠాకూర్ రుడా ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం వద్ద ప్రతిపాదన పెట్టడమే కాకుండా పట్టుబడుతున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు దీనికి సంబంధించి ప్రక్రియ ముందుకు సాగడంలో చొరవ చూపుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 7,59,332 జనాభా ఉంది. 2024లో ఈ జనాభా 15లక్షలు దాటుతుందని అంచనా వేస్తున్నారు. 7లక్షల జనాభాతో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి ప్రాథమికంగా ఆమోదం తెలిపినట్టు తెలుస్తుంది. ఈనెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో దీనికి సంబంధించి ఎజెండా పెట్టనున్నారు.

● నామకరణమే తరువాయి..

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు ఖాయమైపోయింది. ఇక నామకరణమే మిగిలింది. సుదీర్ఘ కాలంగా రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) ఏర్పాటు చేయాలని జిల్లాలో డిమాండ్ ఉంది. రామగుండానికి చారిత్రక, పురాణాల నేపథ్యం ఉంది. రామయణ కాలంలో రాముడు ఇక్కడ నివసించాడనే నానుడింది. ఆ పేరునే రామునిగుండాలు ఉన్నాయి. ఈ గుండాల పేరు మీదునే ఈ నగరానికి రామగుండంగా పేరు వచ్చింది. జనగామలో పురాతన త్రిలింగ రాజరాజేశ్వరస్వామి దేవాలయం కూడా ఉంది. దేశంలోనే ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి పరిశ్రమలున్నాయి. ఈ నేపథ్యంలో రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీనే సముచితంగా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. కాగా జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ విస్తరిస్తుండడంతో మరేదైనా పేరును ఖరారు చేస్తారా అనే చర్చ కూడా సాగుతోంది. కరీంనగర్‌లో శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, వరంగల్‌లో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వంటివి ఏర్పాటు చేశారు. ఇక జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు, యంత్రాంగం సూచించే పేరునే ఖరారు చేసే అవకాశం ఉంది.

23 నుంచి వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలి

తిమ్మాపూర్, అక్టోబరు18 (ఆంధ్ర జ్యోతి): డిప్లొమా ఇన్ ఎలమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(డీఈ ఈసెట్)-2024 ఉత్తీర్ణులై సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు 23వ తేదీ నుంచి డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరిఫికెట్ల పరిశీలనకు హాజరు కాని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన అభ్యర్థులు ఈ నెల 21న కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



అంబేద్కర్ విగ్రహంకు వినతిపత్రం సమర్పిస్తున్న సర్పంచులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న సర్పంచుల బిల్లులను విడుదల చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామని తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబే ద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన శిబిరంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో భాగంగా గత ప్రభుత్వం అనుమతులతో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. వాటికి సంబంధించిన బిల్లులు రాక పలువురు సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను విడదల చేయకుండా గత ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు విడదల చేయడంలో చిన్నచూపు చూడడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బిల్లులు విడుదల చేసే వరకు జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామన్నారు. తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దమ్మ అంజయ్య, ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి, కార్యదర్శి కోల నర్సయ్య, ఏనుగుల కేశవరావు, నాయకులు గాండ్ల సుమతి, తాడెపు ఎల్లం, వెంకటనర్సింహారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాలపై ఎన్టీపీసీ నిర్లక్ష్యం

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గుంతలు పడిన రోడ్డు

అంతర్గాం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని నిర్వాసిత గ్రామం కుందనపల్లిపై ఎన్‌టీపీసీ సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా నిర్లక్ష్యం వహిస్తోంది. ఎన్‌టీపీసీ సంస్థ నిర్మాణ సమయంలో కుందనపల్లికి చెందిన రైతుల నుంచి వందలాది ఎకరాల భూములు సేకరించి యాష్‌పాండ్‌లు నిర్మించింది. దీంతో బూడిద కారణంగా కుందనపల్లి అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నది. యాష్‌పాండ్‌ల కారణంగా గ్రామంలోని బావులోని నీరు కలుషితం కావడంతో పాటు వీచే గాలులతో బూడిద మొత్తం పైకి లేచి గ్రామాన్ని కమ్మేస్తోంది. బూడిద చెరువుల కారణంగా గ్రామస్థులు నిత్యం కాలుష్యం కోరల మధ్య జీవనం కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్‌టీపీసీ నిర్మాణ సమయంలో గ్రామస్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ విస్మరించి ఎన్‌టీపీసీ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్‌టీపీసీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడి బూడిద నివారణ చర్యలు చేపట్టి మౌలిక సదుపాయాల కల్పనలో కృషి చేయాలని కోరుతున్నారు.

● పూర్తిగా చెడిపోయిన రహదారులు..

ఎన్‌టీపీసీ నిర్వాసిత గ్రామం కుందనపల్లి పంచాయతీ పరిధిలోని మొగల్ పహాడ్, అక్బర్‌నగర్, బద్రిపల్లి గ్రామాల్లో గత కొన్ని సంవత్సరాలుగా రహదారులు నిర్మించకపోవడంతో ప్రస్తుతం ఆయా గ్రామాల్లోని రహదారులు పూర్తిగా చెడిపోయి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ఎన్‌టీపీసీ యాజమాన్యం వెంటనే స్పందించి గ్రామాల్లో రహదారుల నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● సాగుకు నోచుకోని పంట పొలాలు..

మండల పరిధిలోని ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామం కుందనపల్లిలో పంట పొలాలు గత కొన్ని సంవత్సరాలుగా సాగుకు నోచునోవడం లేదు. ఎన్‌టీపీసీ యాష్ పాండ్ బూడిద కారణంగా పంట పొలాల్లో తుంగ మొలిచి భూములు ప్రస్తుతం సాగుకు పనికి రాకుండా పోయాయి. ఎన్‌టీపీసీ యాజమాన్యం వెంటనే స్పందించి పొలాల్లో మొలిచిన తుంగను తొలగించి పంట పొలాలు సాగుకు అనువైన పరిస్థితులని నెలకొల్పాలని కుందనపల్లి రైతులు కోరుతున్నారు.



పొలాల్లో మొలిచిన తుంగ

● మరమ్మతులకు నోచుకోని నీటి శుద్ధి కేంద్రం..

కుందనపల్లి పరిధిలో గల మొగల్‌పహాడ్ గ్రామంలోని మంచి నీటి శుద్ధి కేంద్రం గత సంవత్సరకాలంగా పనిచేయకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌టీపీసీ సంస్థ సీఎస్ఆర్-సీడీలో భాగంగా నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ గత సంవత్సర కాలంగా నీటి శుద్ధి కేంద్రం పనిచేయకపోవడంతో ప్రజలు దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. ఎన్‌టీపీసీ యాజమాన్యం వెంటనే స్పందించి మంచి నీటి శుద్ధి కేంద్రం మరమ్మతులు చేపట్టి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

భూములు సాగుకు నోచుకోవడం లేదు..



ఎన్‌టీపీసీ నిర్మాణ సమయంలో సేకరించిన భూములు పోను మిగి లిన కొద్దిపాటి భూముల్లో తుంగ మొలిచి సాగుకు నోచుకోవడం లేదు. ఎన్‌టీపీసీ యాజమాన్యం భూములు సాగుకు ఉపయోగ పడేలా చర్యలు చేపట్టాలి.

- మేకల బాపు, రైతు, కుందనపల్లి

న్యూస్ బాక్స్

అవగాహన పెంచుకోవాలి

ఓదెల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చదువుకున్న ప్రతి వ్యక్తి కంప్యూటర్ భాషపై అవగాహన పెంపొందించుకోవాలని పోలీస్ సిబ్బంది కోరారు. శుక్రవారం మండలంలోని పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కానిస్టేబుళ్లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో యువత పెడదారి పట్టకుండా చదువుపై శ్రద్ధ వహించాలని తెలిపారు.

షీటీంపై అవగాహన

జూలపల్లి, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థినిలకు షీటీంపై జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో వారికి ఏఎస్ఐ మల్లయ్య ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షీటీం సభ్యులు, సురేష్, స్నేహలత, భరోసా కోఆర్డినేటర్ ఆశ్రీత, ఆస్మా, మాధవి, ప్రిన్సిపాల్ విశ్వప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పీఆర్ ఏఈగా వరలక్ష్మి

రామగిరి, అక్టోబరు 18: మండల పరిషత్ ఏఈ పీఆర్‌గా వరలక్ష్మి శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. గతంలోని పనిచేసిన ఏఈ పీఆర్ బదిలీ పై వెళ్ళగా ఆయన స్థానంలో ముత్తారం నుంచి వరలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మార్కండేయకాలనీ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో 33/11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం నగరంలో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకాలు ఏర్పడనున్నట్టు ఏడీఈ అడి చర్ల శ్రీనివాస్ పేర్కొన్నారు.

● కమాన్‌పూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కమాన్‌పూర్, రొంపికుంట సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని సెక్షన్ ఇంచార్జీ ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 11 వరకు జూలపల్లి, పెంచికల్‌పేట, గుండారం, రొంపికుంట, నాగారం, వీరపల్లి, గొల్లపల్లి, సిద్దిపల్లె తదితర గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలని పేర్కొన్నారు.

హామీలు ఘనం.. నిధులు శూన్యం..

- జూలపల్లి, వడుకాపూర్ గ్రామాల మధ్య శిథిలమైన రోడ్డు
- ముందుకు సాగని జూలపల్లి-పెద్దపల్లి డబుల్ రోడ్డు నిర్మాణం
- ఏళ్లు గడుస్తున్నా ఆచరణకు నోచుకోని నేతల హామీలు


జూలపల్లి, వడుకాపూర్ గ్రామాల మధ్య శిథిలమైన రోడ్డు

జూలపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జూలపల్లి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామంటూ నేతలు గుప్పిస్తున్న హామీలు ఆచరణకు నోచుకోవడం లేదు. ఏళ్లు గడుస్తున్నా దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో మండల ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ కష్టాలు తీరడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి వెంకట్రావుపల్లి గ్రామ శివారు వరకు ఎన్నో ఏళ్ల క్రితం వేసిన రోడ్డు మార్గం శిథిలమై గుంతలుగా మారింది. దీంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. జూలపల్లి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం వరకు డబుల్ రోడ్డును నిర్మించాలనే మండల ప్రజల చిరకాల వాంఛ ఎన్ని ప్రభుత్వాలు మారినా నెరవేరడం లేదనే విమర్శలు వినిపిస్తు న్నాయి. మండల కేంద్రానికి డబుల్‌రోడ్డు నిర్మించాలని కోరుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల తోపాటు ప్రజలు పలుమార్లు ఆందోళనలు చేశారు. అయితే సమస్య పరిష్కారానికి కృషిచేస్తామంటూ అప్పటి ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీలు ఆచరణకు నోచుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఒక జాతీయ పార్టీ నాయకుడైన మారం తిరుపతి యాదవ్ గతంలో జూలపల్లి నుంచి జిల్లా కేంద్రం వరకు మండల ప్రజలతో కలిసి పాద యాత్రను కూడా చేపట్టాడు. డబుల్‌రోడ్డు నిర్మాణానికి 19కోట్ల 80లక్షల రూపా యల ప్రభుత్వ నిధులను మంజూరు చేశామని అప్పటి నాయకులు హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించారని, అయితే వాస్తవానికి నిధులు మంజూరు కాలేదని పలువురు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో చేయలేని పనులను తాముచేసి చూపిస్తామంటూ అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు జూలపల్లికి డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుచేయలేదని విమర్శిస్తున్నారు. నిట్టూరు గ్రామ శివారు నుంచి కాచాపూర్ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం జూలపల్లి మండల కేంద్రం వరకు నిధులు మంజూరు చేయలేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరుతున్నారు.

గోదావరిఖనిలో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు


ధ్వంసమైన షాపు షటర్, బొద్దులు


కూల్చివేయొద్దంటూ కోరుతున్న షాపు యజమాని

కోల్‌సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖని మున్సిపల్ జంక్షన్ నుంచి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ జంక్షన్ వరకు ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపు కొనసాగుతుంది. రెండు రోజులుగా ఆక్రమణలు తొలగిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌లపైన కొందరు రేకులు రేకులు వేసి ఉండడంతో వాటిని తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల టౌన్ ప్లానింగ్ అధికారులు దూకుడుగా వ్యవహరించారు. తమ షాపుల ముందు ఎండ పడకుండా షీట్లు వేసుకున్నామని, వాటిని తొలగించుకుంటామని పలువురు వ్యాపారులు చెప్పినా కూల్చివేశారు. గోదావరిఖని మెయిన్ చౌరస్తాలో శుక్రవారం కొంత ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. తమకు సాయంత్రం వరకు సమయం ఇవ్వండి, రేకులు తొలగిసామని వ్యాపారులు పేర్కొన్నారు. కాంగ్రెస్ అడ్డగా పేరున్న సౌమ్య రైస్ డిపో రేకులు తొలగించే విషయంలో యజమాని శ్రీనివాస్ టౌన్ ప్లానింగ్ అధికారులను వేడుకున్నారు. తనకు గంట సమయం ఇస్తే ఫ్యాబ్రికేషన్ వారిని పిలిచి రేకులను తొలగిస్తానని, తాను ఫుట్‌పాత్ ఆక్రమించలేదని పేర్కొన్నారు. జేసీబీతో రేకులను తొలగించే సమయంలో షాపు కొంత మేర ధ్వసంమైంది. షాపు షెటర్లు, బొద్దులు కూలిపోయాయి. దీంతో రాత్రి షాపు ముందు జాగరం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తనను బలిపశువు చేశారని, కావాలని షాపును ధ్వంసం చేశారని బాధితుడు శ్రీనివాస్ ఆరోపించారు. దీంతో పలువురు వ్యాపారులు టౌన్ ప్లానింగ్ సిబ్బందితో తీవ్ర వాగ్వాదం చేశారు.

ఇద్దరు టౌన్ ప్లానింగ్ అధికారులు కొత్తగా వచ్చిన వారు కావడంతో కొంత సమన్వయ లోపం కూడా ఏర్పడుతోంది.

విద్యార్థులకు అభినందన

సుల్తానాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో తమ స్కూల్ విద్యార్థులు ప్రియదర్శిని, లాస్య, ఖుషి, అద్వైత్, అక్షిత్, సుశాంత్, నిఖిల్, లిఖిత తదితరులు ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఇండియన్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ అన్నారు. పోటీలకు ఎంపికైన వారిని అభినందించారు. డైరక్టర్ క్రిష్ణప్రియ, పీఈటీలు సత్యం, ఇక్బాల్, శివ, సతీష్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సమీక్ష సమావేశం

రామగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారంపేట్ గ్రామంలో శుక్రవారం ఉపాధిహామీ పనులపై ఎంపీడీవో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పనులపై గ్రామ సభలో చర్చించి పనులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో టీఏ అఖిల, పంచాయతీ కార్యదర్శి రాకేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని 8వ వార్డు కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి సురేందర్ సన్నీ తెలిపారు. వార్డు పరిధిలోని మజీద్ ఏరియాలో స్వచ్ఛ శుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. మురికికాలువలో పూడికలను తొలగించారు. రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలను తొలగించి, క్లోరినేషన్ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సంపత్, అల్క జావాన్ కనుకుంట్ల కరుణాకర్, సిబ్బంది ఈర్ల భూమయ్య, అసంపల్లి ఎల్లమ్మ, జక్కినపెల్లి అనంత, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి ఫ్యాన్ల వితరణ

ఓదెల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గీత కార్మికుల ఆరాధ్యదైవమైనా ఓదెల రేణుక ఎల్లమ్మ ఆలయానికి శుక్రవారం గ్రామానికి చెందిన ఇరుకుల్ల శివశంకర్ ఫ్యాన్‌లను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు నాగపూరి రవి, ఐలు స్వామి, ముంజాల మహేందర్, చింతల పరశురాంతో పాటు పలువురు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం మండల కార్యవర్గం

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ధర్మారం మండలం మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తన్నీరు రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా కొత్త మోహన్, కోశాధికారిగా అడువాల రవి, గౌరవధ్యక్షులుగా దీటి శ్రీనివాస్, మిట్ట తిరుపతి, ప్రతాప్, గౌరవ సలహాదారులుగా రాచూర్తి శ్రీధర్, పెంచాల రాజేశం, ఆవుల శ్రీనివాస్, మంద శ్రీనివాస్, ఎగ్గెల స్వామి, ఉపాధ్యక్షులుగా ముదం శ్రావణ్‌కుమార్, గాండ్ల నర్సయ్య, నారా ప్రేమ్‌సాగర్, గోరువంతుల శ్రీనివాస్, సాన రాజేందర్, కార్యదర్శిగా ఎడపల్లి సంతోష్, జంగిలి లక్ష్మణ్, అనుమల్ల శ్రీనివాస్, పొనగంటి లచ్చయ్య, సహాయ కార్యదర్శులుగా ఆకారి మహేష్, అరె కోమురయ్య, సాయిని కోమురయ్య, చిందం మల్లేశంలను ఎన్నుకున్నారు. అనంతరం కమిటి సభ్యులను ఘనంగా సన్మానించారు.

స్వచ్ఛత పాటిస్తేనే సీజనల్ వ్యాధులు దూరం

- ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పరిసరాల్లో శుభ్రత పాటిస్తేనే సీజనల్ వ్యాదులు ప్రబలకుండా ఉంటాయని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. స్వచ్ఛ శుక్రవారంలో భాగంగా మండలంలోని కమ్మర్‌ఖాన్‌పేట, కొత్తూరు గ్రామాల్లో పరిశుభ్రత పనులను పరిశీలించారు. ఈసందర్బంగా ఇంటింటా ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తిరుగుతూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో సందర్శించి పలు సూచనలు చేశారు. ఈసందర్బంగా ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు సీజనల్ వ్యాదులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటా శుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వారి వెంట ఏపీవో రవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కూల్చివేయడం సరికాదు..

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఓల్డ్ అశోక వద్ద దుకాణాలు కూల్చివేయడం సరైంది కాదని బాధితులు వేముల అశోక్ ఆరోపించారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓల్డ్ అశోకతోపాటు అందులో ఉన్న షటర్లు చట్టబద్ధంగా నిర్మించామని, వీటిపై హైకోర్టులో కేసు నడుస్తోందని, ఎలాంటి సమాచారం లేకుండా ఈ నెల 15న దుకాణాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరిగిందని, విద్యుత్ శాఖను ప్రశ్నిస్తే మేయర్ చెబితే కనెక్షన్లు తొలగించామని చెబుతున్నారని, తమ దుకాణాలను కూల్చివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, వీటి జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. ఎవరైనా తమ స్థలంలో ప్రవేశిస్తే చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామన్నారు. విలేకరుల సమావేశంలో పులిపాక రాజ్‌కుమార్, జేవీ రాజు, బాధితులు పాల్గొన్నారు.

'మాలలను అవమానిస్తే సహించేది లేదు'


సమావేశంలో మాట్లాడుతున్న మాల సంఘం నాయకులు

మార్కండేయకాలనీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో అంబేద్కర్ భవనం పేరిట ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు బొంకూరి మధు డబ్బులు వసూలు చేసింది వాస్తవం కాదా అని మాల సంఘం అధ్యక్షుడు దిగుట్ల లింగయ్య, గడ్డం నారాయణ, శ్రీహరి, మద్దెల శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంబేద్కర్ భవనానికి స్థలం కేటాయించిన నుంచి అన్యక్రాంతం అవుతుందని ప్రజలందరికి తెలుసునన్నారు. మాల సంఘం నాయకులు చౌరస్తాలో కార్యాలయం పెట్టి పంచాయతీలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారని బొంకూరి మధు మాట్లాడడం విడ్డూరంగా ఉందని, అంబేద్కర్ భవనం పేరిట వసూళ్లకు పాల్పడింది ఎవరో, బ్లాక్ మెయిల్ చేయిస్తుంది ఎవరో, కేసులు పెట్టిస్తున్నది ఎవరో ప్రజలకు తెలుసునన్నారు. దళితులంటే ఎవరు ఇండ్లు కిరాయికి ఇవ్వడం లేదని, ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల్లోకి తీసుకోవడం లేదన్నారు. బొంకూరి మధు పంచాయితీలకు, దందాలకు పాల్పడుతూ మాల సంఘం నాయకులను విమర్శిస్తే సహించేదిలేదని, రాజ్యాంగపరంగా, చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మాల మహానాడు నాయకులు కుమార్, లింగయ్య, మొండయ్య, భూమయ్య పాల్గొన్నారు.

అర్థరహిత వ్యాఖ్యలు సరికావు

కమాన్‌పూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మంథని మాజీ ఎమ్మెల్యే దంపతులపై అర్థరహిత వ్యాఖ్యలు సరికావని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారిని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో గుణపాఠం తప్పదన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తూ, అసత్య ఆరోపణలు చేస్తూ పది నెలల సమయం గడిచిన ప్రజలకు చేసిందేమో చెప్పలేక, ఏమి చేయలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. అధికారంలో వచ్చిన తర్వాత కూడా అలానే ప్రవర్తిస్తున్నారని, దీనికి మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఈ సమావేశంలో నాయకులు బొమ్మగాని అనిల్‌గౌడ్, మేకల సంపత్, పొన్నం రాజేశ్వరి, గుర్రం లక్ష్మీమల్లు, కొండా వెంకటేష్, పోలు దాసరి సాయికుమార్, నీలం శ్రీనివాస్, ఎలబోయిన రామ్మూర్తి, తోట రాజ్ కుమార్, సుధాకర్, శంకర్, పోట్ల శంకర్, పవన్ తదితరులు ఉన్నారు.

కాషాయీకరణ విద్యా విధానం కోసం కేంద్రం కుట్ర



సభలో మాట్లాడుతున్న ఐ కృష్ణ

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ సర్కార్ కాషాయీకరణ విద్యావిధానం కోసం కుట్రలు చేస్తుందని, అలాంటి కుట్రలను తిప్పి కొట్టేందుకు విద్యార్థిలోకం సిద్ధం కావాలని పీడీఎస్‌యూ మాజీ నాయకులు ఐ.కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పీడీఎస్‌యూ అర్థ శతాబ్ది జిల్లా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణ మాట్లాడారు. మోదీ సర్కార్ రాజ్యాంగాన్ని రద్దు చేసి మను ధర్మ శాస్త్రాన్ని ప్రవేశపెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. నేడు దేశంలో కొనసాగుతున్న విద్య మనిషి నిజ జీవితంలో ఏ మాత్రం ఉపయోగపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1972లో జార్జిరెడ్డి స్థాపించిన పీడీఎస్‌యూ గత 50 ఏళ్ళుగా అలుపెరుగని పోరాటాలు చేస్తూ విద్యార్థులకు అండగా నిలుస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణస్వామి, సాలగామ మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, ఈ.నరేష్, బీ అశోక్, బడికెల ప్రసన్నకుమార్, వంశీ, సోయల్, సాయికృష్ణ, రాజ్‌కుమార్, రాకేష్, ప్రణీత్, ఆనంద్, రవికుమార్, దుర్గయ్య, రాజన్న, కాంపెల్లి మల్లేష్ పాల్గొన్నారు.

'ఓబీ కాంట్రాక్టు కార్మికుల బోనస్‌పై వివక్ష'

రామగిరి, అక్టోబరు 18: సింగరేణిలో పనిచేసే ఓవర్‌బర్డెన్ కాంట్రాక్టు కార్మికుల బోనస్‌పై యాజమాన్యం వివక్ష చూపుతోందని జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు ఆరోపించారు. శుక్రవారం సెంటినరీ కాలనీ రామగిరి అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్జీ-2 డివిజన్ పరిధిలోని ఓబీ పనులు నిర్వహిస్తున్న సుశీ కంపెనీలోని కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ప్రకటించినా నేటి వరకు చెల్లింపులు జరగలేదన్నారు. కాంట్రాక్టు కార్మికుల బోనస్ చెల్లింపులో సరైన లెక్క, పత్రం లేకుండా ఉందని ఆరోపించారు. బోనస్ మాట అటుంచినా కనీసం కార్మికుల 36రోజుల వేతనం ఎగవేశారని, కాంట్రాక్టు కార్మికుల న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 10నెలలు గడుస్తున్న మంథని ప్రాంత అభివృద్ధి జరగడం లేదన్నారు. సమావేశంలో నాయకులు పూదరి సత్యనారాయణగౌడ్, మ్యాదరబోయిన కుమార్ యాదవ్, కాపురబోయిన భాస్కర్, జాపతి శేఖర్, తగరం శంకర్‌లాల్, దేవ శ్రీనివాస్, బుర్ర శంకర్, దామోరశ్రీనివాస్, సైండ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించిన ఓసీపీ-1


ఓసీపీ-1 ప్రాజెక్టు

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):2022-23 సంవత్సరానికి దేశంలోని బొగ్గు, లిగ్నైట్ గనుల పనితీరు ఆధారంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఇచ్చిన రేటింగ్‌లో ఓసీపీ-1 ప్రాజెక్టు ఫైవ్‌స్టార్ రేటింగ్ సాధించింది. కోల్ కంట్రోల ర్ డిప్యూటీ డైరెక్టర్, బొగ్గు శాఖ అన్ని బొగ్గు సంస్థల్లోని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, భూగర్భ ప్రాజెక్టుల కార్యకలాపాలు, పర్యావరణం, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక పనితీరు, ఆర్‌అండ్‌ఆర్, ఉద్యోగి సంక్షేమం, తీసుకుంటున్న రక్షణలను ప్రామాణికంగా తీసుకుని ఆయా సంస్థల్లో ఉత్తమ ప్రాజెక్టును ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తున్నట్టు ప్రకటించింది. సింగరేణి నుంచి అన్ని గనులు, ఓసీపీల్లో రామగుండం ఓసీపీ-1 91 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల21న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులకు బహుమతి అందజేయనున్నారు. ఫైవ్‌స్టార్ రేటింగ్ సాధించేందుకు కృషిచేసిన ప్రాజెక్టు అధికారి, మనేజర్, సూపర్‌వైజర్లు, అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులను అభినందిస్తున్నట్టు ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు క్రమశిక్షణ, సమష్టిగా పనిచేయాలని జీఎం సూచించారు.

మృతుడి నేత్రాలు దానం..

ఓదెల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి మేకల ఓదెలు మృతిచెందగా కుటుంబ సభ్యులు నేత్రాలు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ భీష్మాచారి ఎల్‌వీ ప్రసాద్ ల్యాబ్‌టెక్నీషియన్‌తో శుక్రవారం కార్నియాలు సేకరించి హైదరాబాద్ ఐ బ్యాంకుకు తరలించారు.


తుప్పు పడుతున్న క్రీడా సామగ్రి


పార్కులో మందుబాబుల అడ్డా..

మంథనిలో ఆహ్లాదం పంచని 'ఎకో పార్కు'

- నిర్వహణ లోపంతో నిరుపయోగం

మంథని, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మంథని మున్సిపల్ పరిధిలో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఎకో పార్కు నిరుపయోగంగా మారింది. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు నిర్వహణను గాలికి వదిలి వేశారు. స్థానిక బోయినిపేటలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన సుమారు 50 లక్షల రూపాయలతో ఎకరంన్నర విస్తీర్ణంలో 2017 సంవత్సరంలో ఏర్పాటు చేసిన ఎకో పార్కు అలంకార ప్రాయంగా మారింది. మున్సిపల్ సిబ్బంది కొద్ది నెలలుగా మెయింటనెన్స్ లేక తాళం వేసి ఉంచారు. దీంతో సాయంత్రం వేళల్లో ఆహ్లాదం కోసం ఎక్కో పార్కుకు వచ్చే చిన్నారులు, సందర్శకులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. పార్కులోని చిన్నారులు ఆడుకునే క్రీడా సామగ్రి పూర్తిగా తుప్పు పట్టి పోతున్నది. ఇప్పటికే క్రీడా సామగ్రి సగానికి పైగా విరిగిపోయి చిన్నారులు ఆడుకోవటానికి సైతం పనికి రాకుండా పడి ఉన్నాయి. చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. పట్టణ శివారు ప్రాంతంలో ఉండటంతో పార్కు పరిసరాలు మందుబాబులు, గంజాయికి అలవాటు పడిన వారికి అడ్డాగా మారాయి. ఎక్కడ పడితే అక్కడ తాగి పడవేసిన ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. బాత్‌రూంకు డోర్లు లేని కారణంగా అసాంఘిక కార్యకలపాలకు నెలవుగా మారింది. స్థానికులు సైతం పార్కు పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారు. దీంతో పార్కు ఏరియాలో దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపల్ పరిధిలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఎలాంటి పార్కులు లేకపోగా ఉన్న ఒక్క ఎక్కో పార్కు సైతం నిర్వాహణ లేక తాళం వేయడంతో ప్రజలు నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఎక్కో పార్కుపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. చిన్నారులు, సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా మున్సిపల్ అధికారులైనా చర్యలు తీసుకోవాలని, సందర్శకుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన బాత్‌రూంలు

వినియోగంలోకి తెస్తాం..

- పెంద్రి రమ-సురేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్



మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ఎకో పార్కును మరింతగా అభివృద్ధి చేస్తాం. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా మరిన్ని సౌకర్యాలు కల్పించి త్వరలోనే పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తాం. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరద నీరు, బురద చేరడంతో ఎకో పార్కును మూసివేశాం. బొక్కలవాగు రెండు కరకట్టల మధ్య ఉన్న లోతైన స్థలంలో పార్కు ఉండటంతో ఇలాంటి ఇబ్బంది వచ్చింది. ప్రస్తుతం ఎకో పార్కులో పారిశుధ్య పనులు మున్సిపల్ సిబ్బంది చేస్తున్నారు. శుభ్రం చేశాక సౌకర్యాలు, వసతుల కల్పనపై దృషి సారిస్తాం. ఎకో పార్కుతోపాటు బొక్కలవాగు కట్టపై పచ్చదనం, మహిళలకు ప్రత్యేక జిమ్, చిన్నారుల పార్కు, బుద్ధ విగ్రహం ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడానికి కృషి చేస్తాం.

మంథనిలో కోతుల బెడదకు చెక్

- బోను సహాయంతో పట్టివేత.. అడవిలో విడుదల
- ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలు

మంథని, అక్టోబర్ 18: మంథని మున్సిపల్ పరిధిలో కోతుల బెడదకు చెక్ పెట్టేందుకు శ్రీకారం చుట్టారు. రెండు రోజులుగా పట్టణ పరిధిలో వివిధ ప్రాంతాల్లో ఆపరేషన్ మంకీస్ కొనసాగుతోంది. కోతుల బెడదపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు రావడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి, పాలక వర్గం వాటి పట్టుకోవడం, బెడద నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందు కోసం ఆంధ్రాలోని నెల్లూరు ప్రాంతాకి చెందిన కోతులు పట్టే వారితో ప్రత్యేకంగా మాట్లాడి ఇక్కడి రప్పించారు. దీంతో వారు బుధ, గురువారాల్లో సుమారు 200కోతులను పట్టుకొని బోనులో బంధించారు. బొక్కలవాగు కట్టపై బోన్లు ఏర్పాటు చేసి అందులో ఆహారం ఉంచి కోతులు ఆహారం కోసం అందులోకి వెళ్లగానే బోను గేట్ ఆటోమెటిక్‌గా పడేలా ఏర్పాట్లు చేసి కోతులను పడుతున్నారు. ఇలా మంథని ప్రాంతంలోని ఉన్న కోతులను పూర్తిగా పట్టుకొని బంధించడానికి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నారు. పట్టుకున్న కోతులను అడవిలో వదిలి పెడుతున్నారు. పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లో ఇటీవల కాలంలో కోతుల బెడద విపరీతంగా పెరగడం, దాడులు, బెదిరింపులతో జనం బెంబేలెత్తిపోతున్నారు. గుంపులుగుంపులుగా ఆహారం కోసం ఇండ్ల మీద పడుతున్నాయి. ఇండ్లలోకి వచ్చి తిను బండారాలు ఎత్తుకుపోవడం, షాపుల్లోకి వచ్చి వస్తువులను చిందరవందర చేస్తున్నాయి.వీటి అడ్డుకొని, బెదిరించే ఇండ్లలోని వారిపై దాడులకు సైతం తెగబడుతున్నాయి. వీటి దాడిన పడి చాలామంది ఆసుపత్రుల పాలయ్యారు. నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటిలోకి, పరిసరాల్లోకి ఎప్పుడు ఎలా వస్తాయో తెలియక జనం ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి సమయంలో ఆపరేషన్ మంకీస్ ద్వారా కోతులను బంధిస్తుండటంతో ఇన్ని రోజులు వాటితో అనేక విధాలుగా ఇబ్బందులు పడ్డ జనం ఊపిరి పీల్చుకుంటున్నారు.